### పౌరహక్కుల ఉద్యమ నిర్మాత

# జాపా లక్ష్మారెడ్డి 4వ వర్ధంతి సభను జయప్రదం చేయండి!

**స్థలం: కళాభారతి, కరీంనగర్**     **తేది: నవంబర్ 24, సా॥ 6 గం॥**

**కాళోజీ, తారకం, కన్నాభిరాన్, ప్రొఫెసర్ హరగోపాల్, బాలగోపాల్ తదితరులు మాట్లాడతారు.**

ప్రజలారా!

1986 నవంబర్ 7వ తేదీ తెల్లవారుజామున ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడైన జాపా లక్ష్మారెడ్డిగారిని అల్గునూరులోని ఆయన స్వగృహంవద్ద పోలీసులు కాల్చి చంపారు. అంతకు ముందు ఒక సంవత్సరకాలంగా కరీంనగర్ జిల్లాలో పౌరహక్కుల సంఘం కార్యకర్తలమీద పోలీసులు చేస్తున్న దాడులకు కొనసాగింపుగా ఈ హత్య జరిగింది. ఎన్ని రకాలుగా భయపెట్టినా పౌరహక్కుల గురించి మాట్లాడడం మానుకోని లక్ష్మారెడ్డి గారి నోరు నొక్కేయడానికి వేరే మార్గం దొరకక ఆయన ప్రాణమే తీసారు.

లక్ష్మారెడ్డి గారి జీవితం కరీంనగర్ జిల్లా ప్రజాపోరాటాల చరిత్రతో ముడిపడి వుంది. 1940లో ప్రారంభమై ఎడతెరిపి లేకుండా సాగుతున్న రైతాంగ పోరాటాలకూ, రైతుకూలీల పోరాటాలకూ ఆయన బాసటగా నిలబడ్డాడు. తొలినాడు తానే రైతాంగ పోరాటాలు నిర్వహించాడు. చివరి రోజులలో పౌరహక్కుల సంఘం బాధ్యుడిగా ప్రజాపోరాటాలపైన పోలీసులూ భూస్వాములూ జరిపే దాడులను వ్యతిరేకిస్తూ ఆ పోరాటాలకు తోడుగా నిలబడ్డాడు. 1978లో జగిత్యాల సిరిసిల్ల తాలూకాలను కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించి కరీంనగర్ జిల్లాను పోలీసు క్యాంపుల జిల్లాగానూ, చిత్రహింసల జిల్లాగానూ మార్చిన ప్రభుత్వాన్ని, దాని యంత్రాంగాన్నీ ఎండగట్టడంలో ప్రముఖపాత్ర నిర్వహించాడు. 1982 తరువాత జిల్లాలో మళ్ళీ ప్రారంభమయిన ఎన్‌కౌంటర్ల బూటకాన్ని బయటపెట్టడానికి అలసట లేకుండా కృషిచేసాడు. భూస్వామ్య పెత్తనానికీ, వెట్టిచాకిరికీ, బలవంతపు దండుగలకూ పేరుగాంచిన కరీంనగర్ జిల్లా గ్రామీణ జీవితాన్ని నాగరికంగా ప్రజాస్వామికంగా మలచడానికి ప్రభుత్వం ఏ కృషి చేయలేదు గానీ ఆ పెత్తనానికీ చాకిరికీ దోపిడీకీ వ్యతిరేకంగా ఉద్యమించేందుకు ప్రజలు సమాయత్తమయితే వాళ్ల పోరాటాలను 'తీవ్రవాదం' అంటూ ఖండించి పాశవికంగా అణచివేయడానికి మట్టుకు ఆతృతతో ముందుకొచ్చింది. ప్రజల జీవితాలను బాగుచేయలేని ప్రభుత్వం, భూస్వాముల పెత్తనాన్ని అంచలేని ప్రభుత్వం ప్రజల పోరాటాలను కల్లోలంగా చిత్రించడానికి వీలు లేదని లక్ష్మారెడ్డిగారు అన్నారు. ఉద్యమకారులు నేరాలకు పాల్పడితే శిక్షించే బాధ్యత ప్రభుత్వం మీద తప్పకుండ ఉందిగానీ ప్రజాఉద్యమాన్నే నేరంగా పరిగణించడానికి వీలులేదన్నారు. నేర విచారణ పేరుమీద పోలీసులు చట్టాన్ని చేతిలోకి తీసుకొని ప్రజలను చిత్రహింసలు పెట్టడానికి వీలు లేదన్నారు ఒక్కొక్కడూ ఒక్కొక్క రాక్షసుడిగా పేరుపొందిన కరీంనగర్ పోలీసు అధికార్ల దుష్కృత్యాలను బయట పెట్టారు. ఈ విమర్శను సహించలేని జిల్లాపోలీసు యంత్రాంగం ఆయనను బెదిరించడానికి భయపెట్టడానికి చాలా ప్రయత్నాలు చేసింది. పౌరహక్కుల సంఘం కరీంనగర్ జిల్లా శాఖలో ఆయన సహచరులుగా పనిచేసిన వారిని కొట్టి బెదిరించి మాన్పించింది. జగిత్యాలలో భారతీయ జనతాపార్టీ వారికి ప్రోత్సాహం ఇచ్చి పౌరహక్కుల అడ్వకేట్ గోపి రాజన్నను చంపించింది. చేతులు వెనక్కికట్టి అయిదుగురిని కాల్చేసిన కొండాపూర్ 'ఎన్‌కౌంటర్'లో జగిత్యాల సబ్‌కలెక్టర్ దగ్గర సాక్ష్యం ఇవ్వడానికి వెళ్ళిన

పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి మీద అదే గుండాలచేత దాడి చేయించింది. చివరికి లోయర్ మానేర్ డ్యాం పోలీస్ స్టేషన్ ఎస్ఐగా ఉండిన మొగిలయ్యచేత లక్ష్మారెడ్డిగారిని చంపించింది.

పౌరహక్కుల ఉద్యమకారులమీద జరిగిన ఈ దాడులలో ఏ ఒక్కరిమీదా ఇప్పటిదాకా కేసు పెట్టలేదని వేరే చెప్పనవసరం లేదు. కాగా, కరీంనగర్ జిల్లాలో పోలీసుల ఆగడాలు మట్టుకు పెరిగిపోతూ వచ్చాయి. ఇల్లు పీకడం, తగలబెట్టడం. ఇంట్లోని వస్తువులను బావిలో వేయడం, బావి నీళ్ళలో కిరోసిన్ ఆయిల్ కలవడం, పంటలు పశువులతో మేపించడం ఇవన్నీ నిత్యకృత్యాలయ్యాయి. 'ఎన్‌కౌంటర్లు' డజన్ల సంఖ్యలో జరిగాయి. చిత్రహింసలకు లెక్కలేకుండా పోయింది. 9 మంది యువతీయువకులు పోలీసుల కస్టడీనుండి 'మాయం' అయ్యారు. పౌరహక్కులనూ స్వేచ్ఛనూ పునరుద్ధరిస్తానని హామీఇస్తూ ముందుకొచ్చిన చెన్నారెడ్డి పాలనలో ఈ సంవత్సరం కరీంనగర్ జిల్లాలో నాలుగు లాకప్ మరణాలు జరిగాయి (గోదావరిఖని, హుస్నాబాద్, రాయికల్, చిగురుమామిడి). మూడు పోలీస్ స్టేషన్లలో పోలీసులు స్త్రీలపైన అత్యాచారాలు చేసారు (ఎల్లారెడ్డిపేట, వేములవాడ, కమలాపురం). కమలాపురంలో కాల్పులు జరిపి ఒకరిని చంపారు, రెండు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న కమ్యూనిస్టు నాయకుడు సామ అంతిరెడ్డిని చంపి గట్లనర్సింగాపూర్ దగ్గర పారేసారు. గోదావరిఖనిలో పిట్టం సత్తయ్యనూ చంద్రమోహన్‌నూ, సిరిసిల్ల దగ్గర సుభాష్‌నూ 'ఎన్‌కౌంటర్ల' పేరిట హత్యచేసారు.

ఇవ్వాళ రాష్ట్రవ్యాపితంగా ప్రజలమీద, ప్రజాఉద్యమాలమీద నిర్బంధం కొనసాగుతూ వుంది. పోలీస్‌కాల్పులలో ఈ సంవత్సరం ఇప్పటికి 26 మందిని చంపారు. 14 మందిని లాకప్పులలో కొట్టి చంపారు. 14 మందిని ఎన్‌కౌంటర్లలో చంపారు భూమికోసం పోరాటం చేస్తున్న గిరిజనులనూ గ్రామీణ పేదలనూ సిగ్గుమాలిన ప్రభుత్వం 'టాడా' క్రింద అరెస్టుచేస్తూ వుంది. పేదలు భూస్వాముల నుండి లాక్కొని దున్నుకొన్న భూములను తిరిగి భూస్వాములకు ఇప్పించడానికి కూడ ప్రభుత్వం వెనకాడడం లేదు. ఈ చర్యలలో భాగంగా మళ్ళీ ఇవ్వాళ రాష్ట్రవ్యాపితంగా గ్రామీణప్రాంతాలలో పోలీసులదాడులూచిత్రహింసలూ కొనసాగుతున్నాయి.

ఒకవైపు ఈ ప్రభుత్వ హింస కొనసాగుతుండగా మరొకవైపు వెనుకబడ్డ కులాలు సాధించుకున్న ఒక కనీస హక్కయిన రిజర్వేషన్లమీద ఆఫీసర్ల బిడ్డలూ భూస్వాముల బిడ్డలూ కాంట్రాక్టర్ల బిడ్డలూ దాడిచేస్తూ 'ప్రతిభ' నాశనం అయిపోతూవుందని అసహ్యకరమైనప్రచారం చేస్తున్నారు. కాయకష్టం చేసుకొని బ్రతికే కులాలకు విద్యా ఉద్యోగరంగాలలో ప్రవేశంపొందే సదుపాయం కల్పించకూడదంటూ ఆత్మాహుతులకు పాల్పడుతున్నారు దానితోపాటు భారత జాతీయ ఉద్యమకాలంలో ఈ దేశప్రజలు సాధించుకొన్న ఒక ముఖ్యమైన విలువ అయినటువంటి లౌకికతత్వం (సెక్యులరిజం) మీద బిజెపి, విశ్వహిందూ పరిషత్‌లు దాడిచేస్తున్నాయి. దేశ వ్యాప్తంగా హిందూ ప్రజానీకంలో మతతత్వాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాయి. మసీదులను, దర్గాలను, ఈద్‌గాలను హిందూ మతోన్మాదులు కూలుస్తున్నారు.

ప్రజాస్వామిక విలువలను, రాజ్యాంగంలోని ప్రగతిశీల విలువలను ఈ విధంగా విధ్వంసం చేస్తున్న ప్రజావ్యతిరేక శక్తులకు వ్యతిరేకంగానూ, ప్రజల జీవించే హక్కును ఖాతరు చేయకుండ ప్రవర్తిస్తున్న పోలీసు యంత్రాంగం అణచివేత చర్యలనూ ప్రతిఘటిస్తూ పౌర హక్కుల సంఘం జాపా లక్ష్మారెడ్డిగారు చూపిన బాటలో పనిచేస్తూవుంది. నాలుగేళ్ళ తరువాత మొట్టమొదటిసారిగా లక్ష్మారెడ్డిగారి స్మారకసభను కరీంనగర్‌లో జరుపుతూవుంది. ఈ సభకు కరీంనగర్ ప్రజలంతా విచ్చేసి జయప్రదం చేయాలని కోరుతున్నాం.

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం
( A P C L C )